సాక్షి అనకాపల్లి

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025

సర్వం...శివోహం



రావికమతం మండలం కల్యాణ లోవలో జలాశయంలో పుణ్యస్నానాలు
(ఇన్‌సెట్) తుమ్మపాల దరి శీరంశెట్టివానిపాలెంలో
శ్రీ ఉమా సమేత పంచముఖ నందీశ్వర స్వామి

హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తజనం మహేశ్వరుడిని కొలిచారు. శివపంచాక్షరితో శివాలయాలు మార్మోగాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని శివాలయాల్లో మహన్యాస రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలతో భక్తులంతా శివుడిని అర్చించారు. పంచదార్లలోని ఉమాధర్మలింగేశ్వరుడిని, ధారమఠంలోని ధారమల్లేశ్వరుడిని, చోడవరంలో గౌరీశ్వరుడిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. కల్యాణలోవ జలాశయం, బలిఘట్టం ఉత్తరవాహిని, పంచదార్లలోని ఆకాశధారల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. రోజంతా జాగరణ ఉండి ఆలయాలు దర్శించారు.



చోడవరం గౌరీశ్వరస్వామి సన్నిధిలో నందీశ్వరుని చెవిలో కోర్కెలు చెప్పుకుంటున్న భక్తులు



బలిఘట్టం ఉత్తర వాహిని నదిలో భక్తుల పుణ్యస్నానాలు



పంచదార్లలో ఆకాశధారలో భక్తుల పుణ్యస్నానాలు

న్యూస్‌రీల్

నేడు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు

అనకాపల్లి : శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా ఈనెల 27న అనకాపల్లి జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటు హక్కు కలిగిన ఉపాధ్యాయులు అందరూ ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు.

3వ తేదీ నుంచి ఓపెన్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

అనకాపల్లి : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ ఇంటర్మీడియట్) పబ్లిక్ పరీక్షల మార్చి 3వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా పరీక్షలు నిర్వహిస్తున్నట్టు డీఈవో గిడ్డి అప్పారావునాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులు పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను విద్యార్థుల పరిధిలో సంబంధిత స్టడీ సెంటర్, లేదా ఏపీ సార్వత్రిక విద్యాపీఠం వెబ్ సైట్ www.apopenschool.ap.gov.in నుంచి డౌన్ లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

కేజీహెచ్‌లో శిశువుల మార్పిడి కలకలం

8లో

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు వేళయింది. ఎన్నికల పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులు పోలింగ్ కేంద్రాలకు చేరాయి. ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అయ్యవార్ల ఎన్నికలకు వేళాయె...



అనకాపల్లి జీవీఎంసీ హైస్కూల్ నుంచి ఎన్నికల సామగ్రి తీసుకెళుతున్న ఎన్నికల సిబ్బంది

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 24 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఉదయం 8 నుంచి ఓటింగ్ ప్రారంభం
- జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకోనున్న 2,885 మంది టీచర్లు
- జీవీఎంసీ హైస్కూల్ నుంచి ఎన్నికల సామగ్రి తరలింపు

సాక్షి, అనకాపల్లి :

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది, పోలీస్ బలగాలు చేరుకున్నాయి. పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన నిఘా కూడా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రంలో ఇన్, అవుట్ సబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేసి..ఎన్నికల సరళి, అదేవిధంగా ఓటర్ల క్యూలైన్లను పరిశీలించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 24 పోలింగ్ కేంద్రాల పోలింగ్ సరళి పరిశీలించడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూంను కూడా ఏర్పాటు చేశారు. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలో 2885 ఉపాధ్యాయులు(ఓటర్లు) ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మొత్తం 2,885 మంది టీచర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. వారిలో 1,789 మంది పురుషులు, 1,096 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు.



పోలింగ్ కేంద్రాలకు బస్సులో బయలుదేరిన సిబ్బంది

భద్రత కట్టుదిట్టం

పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్ట భద్రతకు చర్యలు తీసుకున్నారు. ఒక్కొక్కరికీ ఓటు వేయడానికే మూడు నుంచి ఐదు నిమిషాలు పట్టే అవకాశం ఉంది. అందుకు 300 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రంలో రెండో కంపార్ట్‌మెంట్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రాధాన్యతా క్రమంలో ఎన్నుకోవాలి. ఇందుకు ఆయా అభ్యర్థుల పేర్లకు ఎదురుగా ఉన్న గడిలో 1, 2, 3 అంటూ నంబర్లు వేయాలి. ఈ లెక్కన గంటకు 12 నుంచి 20 మందికి మించి ఓటు వేయడం అసాధ్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఆర్‌వో సత్యనారాయణ

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు..

జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, పోలింగ్ కేంద్రం వద్ద ఎండ వేడిమి తగలకుండా షామియానాలు ఏర్పాటు చేశారు. టాయిలెట్ సదుపాయం లేని దగ్గర బయోటాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రంలోకి చేరుకునే విధంగా మహిళలకు, పురుషలకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వికలాంగులకు, అనారోగ్య సమస్యలున్న ఓటర్లకు ప్రత్యేక అవసరాలు గల ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద వీల్ ఛైర్లు అందుబాటులోకి ఉంచారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఇన్, అవుట్ వెబ్‌కాస్టింగ్ కూడా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంది.

జీవీఎంసీ హైస్కూల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు గానూ బుధవారం ఉదయం 8 గంటలకు అనకాపల్లి టౌన్‌లో గల జీవీఎంసీ హైస్కూల్లో 10 డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల సామగ్రి అందజేశారు. జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలకు 10 రూట్‌లుగా డివైడ్ చేసి 10 మంది సెక్టార్ అధికారులను, మరో 10 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. 10 రూట్‌లకు 10 బస్సుల్లో ఎన్నికల సమాగ్రి, సిబ్బందిని కేంద్రాలకు తరిలించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద పీవో, ఏపీవో, మరో ఇద్దరు అధికారులు, ఒక్కో మైక్రో అబ్జర్వర్‌తో పాటు ఒక ఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుల్, స్ట్రైకింగ్ ఫోర్సు ఉంటుంది. జిల్లాలో మొత్తం 145 మంది ఎన్నికల సిబ్బంది, పోలీసులు ఇప్పటికే కేంద్రాలకు చేరుకున్నారు.

ప్రశాంత పోలింగ్‌కు సహకరించాలి



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. పోలింగ్ రోజు, కౌంటింగ్ రోజును డ్రై డేగా పాటించాలి. ముందస్తు అనుమతి మేరకు అభ్యర్థులు రెండు వాహనాలనే వినియోగించుకోవాలి. అదే విధంగా పోలింగ్ బూత్‌నకు 200 మీటర్ల దూరంలో ఓటరు స్లిప్పులను అందజేయాలి. షామియాలను వేయరాదు. జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలి. పోలింగ్ ఏజెంట్లు పోలింగ్ కేంద్రానికి ఉదయం 7.00 గంటలకే చేరుకోవాలి. ఓటరు ఎపిక్ కార్డు గాని లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలియజేసిన గుర్తింపు కార్డులను ఓటు వేసే సమయంలో వెంట తెచ్చుకోవాలి. పోలింగ్ ఏజెంట్ గాని ఓటరు గాని పోలింగ్ బూత్ లోకి మొబైల్స్ , కెమెరాలను తీసుకురాకూడదు.

– విజయకృష్ణన్, జిల్లా కలెక్టర్, అనకాపల్లి

పటిష్ట బందోబస్తు...



జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. జిల్లాలో సుమారుగా 300 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ఎలక్షన్ విధుల్లో ఉంటారు. జిల్లాలో ఉన్న 10 రూట్లలో(ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు), వాటితో పాటుగా ఒక్కో పోలింగ్ కేంద్రం వద్ద (ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు) వారితో పాటుగా స్ట్రైకింగ్ ఫోర్సు(సీఐ, ఐదుగురు పోలీస్ సిబ్బంది), స్పెషల్ ఫోర్సు(ఎస్ఐ, ఐదుగురు సిబ్బంది), రిజర్వ్ ఫోర్స్(డీఎస్పీ, ఆరుగురు సిబ్బంది) విధుల్లో ఉంటారు.

– తుహిన్ సిన్హా, ఎస్పీ

గ్యాప్ అలాగే ఉంది...

గిరిజన ప్రాంతంలో కొండల మీదనున్న గ్యాప్ ఏరియా భూములను సర్వే చేసేందుకు 17 ఏళ్లుగా కలెక్టర్లు క్షేత్ర స్థాయికి వెళ్లడమే తప్ప సర్వే నేటికీ కార్యరూపం దాల్చలేదు. కలెక్టర్లు వస్తున్నారు.. గ్యాప్ ఏరియా భూములు సర్వే చేస్తారు.. మాకు హక్కు పత్రాలు ఇస్తారని.. ఏళ్ల తరబడి ఎంతో ఆశతో గిరిజనులు ఎదురుచూస్తున్నారు.



కొండల మీదనున్న గ్యాప్ ఏరియా భూములు

- అధికారులకు అంతు చిక్కని గ్యాప్ ఏరియా భూములు
- 2008 నుంచి నేటి వరకు పరిశీలనతోనే సరిపెడుతున్న కలెక్టర్లు
- సర్వే జరగదు... గిరిజనులకు హక్కు దక్కదు
- 16 గ్రామాల పాలిట శాపంగా మారిన లేటరైట్ నిక్షేపాలు
- ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నా అందని హక్కు పత్రాలు
- బ్రిటీష్ హయాంలోనూ సర్వే జరగని వేలాది ఎకరాల గ్యాప్ ఏరియా భూములు

నాతవరం :

ఏళ్ల తరబడి గిరిజనులు పోడు భూములకు హక్కు పత్రాల కోసం అందోళనలు చేస్తున్నారు. ఎంత మంది కలెక్టర్లు వచ్చి గ్యాప్ ఏరియా భూములు చూసినా లేటరైట్ నిక్షేపాలు ఈ ప్రాంతంలో పుష్కలంగా ఉండడంతో కలెక్టరు సైతం ఏమి చేయలేని పరిస్థితులు కన్పిస్తున్నాయి. మండలంలో సరుగుడు సుందరకోట పంచాయతీల పరిధిలో కొండల మీద ఉన్న వేలాది ఎకరాల భూములు బ్రిటీష్ హయాంలోనే సర్వే చేయకుండా వృధాగా వదిలేశారు. గ్యాప్ ఏరియా భూములను సర్వే చేసి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేస్తామంటూ 2008 నుంచి కలెక్టర్లుగా పని చేసిన వారంతా ఈ ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారు.

మొదటిసారి అప్పటి జిల్లా జాయింట్ కలెక్టరు గిరీష్‌శంకర్ ఉమ్మడి సరుగుడు పంచాయతీలో పలు ప్రాంతాలను పరిశీలించారు. ఉమ్మడి రాష్ట్రం ఉమ్మడి జిల్లాలో కలెక్టర్లు , జాయింట్ కలెక్టర్లు , సబ్ కలెక్టర్లుగా పని చేసిన అనేక మంది ఐఏఎస్‌లు ఇక్కడ స్వయంగా పర్యటించారు. ప్రవీణ్‌కుమార్, లవ్‌అగర్వాల్, వినయ్‌చంద్, యువరాజ్, వేణుగోపాల్‌రెడ్డి, ఎ.మల్లిఖార్జున,రవిపట్టాన్‌శెట్టితో పాటు ప్రస్తుతం పని చేస్తున్న కలెక్టరు విజయకృష్ణన్ వరకు గ్యాప్ ఏరియా భూముల సర్వే కోసం స్వయంగా పరిశీలించారు. అయితే సర్వే విషయంలో అడుగు ముందుకు పడలేదు.



ఇటీవల గ్యాప్ ఏరియా పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్



గ్యాప్ ఏరియాకు నడిచి వెళ్తున్న అప్పటి కలెక్టరు రవిపట్టాన్‌శెట్టి (ఫైల్)

10వేల ఎకరాలకు పైగా...

సరుగుడు పంచాయతీ శివారు రామన్నపాలెం, అచ్చంపేట, యరకంపేట, రాజవరం, మాసంపల్లి, దద్దుగుల, సుందరకోట, పంచాయతీ శివారు కొత్తసిరిపురం, ఆసనగిరి, సుందరకోట, కొత్త దద్దుగుల, ముంతమామిడిలోద్దు, బమ్మిడికలోద్దు, తోరడ కోంత లంకలు, సిరిపురం గ్రామాలు ఉన్నాయి. ఆ రెండు పంచాయతీల పరిధిలో 10వేల ఎకరాల పైగా గ్యాప్ ఏరియా భూములు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో గిరిజనులు తుప్పలు డొంకలు కొట్టి పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. తాము సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని ఏళ్ల తరబడి గిరిజనులు అందోళనలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో గిరిజనుల డిమాండ్ మేరకు అప్పటి కలెక్టరు రవిపట్టాన్‌శెట్టి చొరవతో 800 మందికి పైగా పోడు వ్యవసాయం చేసుకునే గిరిజనులకు హక్కుపత్రాలు అందజేశారు. మరో 550 మందికి హక్కు పత్రాలు సిద్ధం చేసి సార్వత్రిక ఎన్నికల కారణంగా నిలిపివేశారు. ఇటీవల కలెక్టరు విజయకృష్ణన్ కొత్త దద్దుగుల ప్రాంతంలో గ్యాప్ ఏరియా భూములను స్వయంగా పరిశీలించి నెల రోజులు వ్యవధిలో సర్వే పూర్తి చేయాలని ఆర్డీవో వి.వి.రమణ, సర్వేయర్లను ఆదేశించారు. ఈ సర్వే ఎంతవరకు వస్తుందనేది వేచి చూడాల్సిందే. గ్యాప్ ఏరియా భూములు సర్వే చేసి రెవెన్యూ రికార్డులలో నమోదు చేస్తేనే గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వడానికి వీలవుతుంది.

గత ప్రభుత్వంలో కొందరికి హక్కు పత్రాలు



గిరిజనులు సాగు చేసుకుంటున్న సాగు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని నేను ఉమ్మడి పంచాయతీ సరుగుడు సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచి విజ్ఞాపనలు అందజేస్తున్నాను. 2013లో కలెక్టరు యువరాజ్, జేసీ నివాస్‌ను స్వయంగా కలిసి విజ్ఞప్తి చేశాను. గత కలెక్టరు రవిపట్టాన్‌శెట్టి కృషితో కొంత మంది గిరిజనులకు హక్కుపత్రాలు ఇచ్చారు. పట్టాలు రావడానికి అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విశేషంగా కృషి చేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొంత మందికి పట్టాలు సిద్ధం చేసినా అందివ్వలేకపోయాం.

–సాగిన లక్ష్మణమూర్తి ఎంపీపీ

38 ఏళ్లుగా ఎదురు చూపులు..



పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులు అందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని ఏళ్ల తరబడి అందోళనలు చేస్తున్నాం. గ్యాప్ ఏరియా భూములు సర్వే చేయాలని అంటున్నారు. కొత్తగా వచ్చిన ప్రతి కలెక్టరు, సబ్ కలెక్టరు సైతం గ్యాప్ ఏరియా భూములు చూడడానికి వస్తున్నారు తప్ప సర్వే జరగలేదు...హక్కు పత్రాలు ఇవ్వడం జరగలేదు. లేటరైట్ నిక్షేపాలు ఉన్నాయని అందువల్ల మాకు హక్కు పత్రాలు ఇవ్వలేదు సర్వే జరగలేదని అనుమానంగా ఉంది.

–బత్తుల కృష్ణ పీసా కమిటీ మాజీ కార్యదర్శి సుందరకోట



మాడుగుల నాగఫణి శర్మకు అవధాన బ్రహ్మ బిరుదును ప్రదానం చేస్తున్న హాస్యనటుడు బ్రహ్మానందం, టీఎస్సార్

ఈశ్వర భక్తి, శక్తి శాశ్వతం

ఏయూక్యాంపస్: అందం, ఆహారం, ఐశ్వర్యం శాశ్వతం కాదని.. ఈశ్వర భక్తి, శక్తి శాశ్వతమని మాజీ కేంద్రమంత్రి టి.సుబ్బరామిరెడ్డి అన్నారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శతావధాని మాడుగుల నాగఫణి శర్మకు అవధాన బ్రహ్మ బిరుదును ప్రదానం చేశారు. ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శ్రీధర స్వామి తదితరులు ప్రసంగించారు. విశాఖ ప్రజల సంతోషాన్ని, అభివృద్ధిని కాంక్షిస్తూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడంపై సుబ్బరామిరెడ్డిని అభినందించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక నాటకం నగరవాసులను అలరించాయి.

నీలకంఠునికి నాట్య నివేదన



ఏయూ క్యాంపస్: శివరాత్రి పర్వదినాన నీలకంఠునికి సాగర తీరంలో నాట్య నివేదన చేశారు. పైన నీలి మేఘం, చెంతనే నీలి సంద్రం.. 'నిమగ్న'పేరిట పరంపర ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ నాట్యాచార్యులు రమా వైద్యనాథ్, బృందంతో చేసిన నృత్యాలు విశాఖ వాసుల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించాయి. కాశీ విశ్వేశ్వరుడిని, కంచి కామాక్షిని కీర్తిస్తూ వీరు చేసిన నృత్యాలు, రాధాకృష్ణుల లీలల్ని వర్ణిస్తూ చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. యువతను శాస్త్రీయ నృత్య కళలవైపు నడిపించే దిశగా ఈ కార్యక్రమం కొనసాగింది. అద్భుత నృత్య ప్రదర్శనలతో విశాఖ వాసులకు అపూర్వమైన అనుభూతులను పంచారు.

క్లుప్తంగా

క్వారీ లారీకి రూ.86 వేలు జరిమానా

అనకాపల్లి : స్థానిక విజయరామరాజుపేట రైల్వే అండ్ బ్రిడ్జి గడ్డర్‌ను అధిక లోడుతో వెళుతున్న క్వారీ లారీ ఢీకొంది. ఈ నేపథ్యంలో గడ్డర్ బుధవారం పడిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని అధిక లోడుతో వెళుతున్న క్వారీ లారీకి రూ.86 వేలు అపరాధ రుసుము విధించారు.

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

అనకాపల్లి : మండలంలోని కొత్తూరు గ్రామానిక చెందిన గొలగాని వెంకట్ (54) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలు...కశింకోట మండలం పూసర్లవీధికి చెందిన గొలగాని వెంకట్ అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 21న ఇంటి వద్ద జారి పడిపోవడంతో అతని తలకు తీవ్ర గాయమైంది. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

శివ పూజలకు పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



కల్యాణలోవ పోతురాజుబాబు, పెద్దింటిమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

- కల్యాణలోవ రిజర్వాయర్‌లో పుణ్యస్నానాలు
- సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం
- ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బంది

రావికమతం: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన చీమలపాడు పంచాయతీ పరిధిలో గల కల్యాణ లోవలో పోతురాజుబాబు మహా శివరాత్రి తిరునాళ్ల బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తెల్లవారు జాము నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పోతురాజుబాబు, పెద్దింటిమ్మ అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్నారు. ఆలయం వద్ద దేవదాయ శాఖ, రెవెన్యూ అధికారులు సదుపాయాలు కల్పించలేదు. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద భక్తులకు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేసేవారు. ఈ ఏడాది చేయకపోవడం వల్ల భక్తులు అవస్థలు పడ్డారు. ప్రైవేటు వర్తకులు అధిక రేట్లకు టిఫిన్లు, ఇతర తినుబండారాలను విక్రయించారు. నర్సీపట్నం ఆర్టీసీ డిపో 50 ప్రత్యేక బస్సులను నడిపింది. స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. డిసిసిబి వారు ఆలయ ప్రాంగణంలో మజ్జిగ పంపిణీ చేసారు. స్వామి వారిని అనకాపల్లి క్రైమ్ ఎఎస్పీ మోహన్‌రావు దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. దొండపూడిలో యువకులు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆలయ అధికారులు కనీసం కుర్చీలు, బెంచీలు కూడా ఏర్పాటు చేయకపోవడం వల్ల రిజర్వాయర్ గట్టు మీదే శిబిరం ఏర్పాటు చేశారు. కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్



దొండపూడిలో భక్తులకు మజ్జిగ, పులిహోర పంపిణీ చేస్తున్న యువకులు



పోతురాజుబాబు, పెద్దింటిమ్మను దర్శించుకుంటున్న అనకాపల్లి ఏఎస్పీ (క్రైమ్) మోహన్‌రావు దంపతులు

కేజీహెచ్‌లో శిశువుల మార్పిడి కలకలం

సిబ్బంది నిర్లక్ష్యంతో ఇరువర్గాల ఆందోళన

దాబాగార్డెన్స్: కేజీహెచ్ మరోసారి వార్తల్లోకెక్కింది. గైనకాలజీ వార్డులో బుధవారం ఉదయం చోటుచేసుకున్న సంఘటన తీవ్ర గందరగోళానికి దారితీసింది. ఇద్దరు తల్లులకు జన్మించిన శిశువులను వారి కుటుంబ సభ్యులకు అప్పగించడంతో సిబ్బంది చేసిన తప్పిదంతో రెండు కుటుంబాలు ఆందోళనకు దిగాయి. వివరాల్లోకి వెళితే.. పరవాడ, కృష్ణా జిల్లాకు చెందిన ఇద్దరు గర్భిణులు ప్రసవం కోసం ఇటీవల కేజీహెచ్‌లో చేరారు. కృష్ణా జిల్లాకు చెందిన గర్భిణి పరిస్థితి విషమంగా ఉండటంతో బుధవారం ఉదయం 7.30 గంటలకు శస్త్రచికిత్స చేశారు. ఆమెకు మగ శిశువు జన్మించాడు. సిబ్బంది ధ్రువీకరణ పత్రాల ప్రక్రియకు అంతా సిద్ధం చేసి, శిశువును తల్లికి చూపించారు. ఫొటో కూడా తీశారు. ఆ తర్వాత, ఆ శిశువును కృష్ణా జిల్లా గర్భిణి కుటుంబ సభ్యులకు ఇవ్వవలసి ఉండగా.. సిబ్బంది నిర్లక్ష్యంతో పరవాడకు చెందిన గర్భిణి సహాయకులకు అందజేశారు. అక్కడకు కొద్ది నిమిషాల్లోనే లేబర్ రూమ్‌లో ఉన్న పరవాడకు చెందిన గర్భిణి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కొద్దిసేపటి తర్వాత ఆడ శిశువును సిబ్బంది కృష్ణా జిల్లా గర్భిణి కుటుంబ సభ్యులకు ఇవ్వడంతో గందరగోళం మొదలైంది. తమకు మగ శిశువు పుట్టాడని చెప్పి ఇప్పుడు ఆడ శిశువును ఇస్తున్నారేమిటని వారు ప్రశ్నించారు. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఉదయం 7.30 గంటలకు జరిగిన ఈ ఘటనను తొలుత సిబ్బంది దాచి పెట్టే ప్రయత్నం చేశారు. అయితే బాధితులు ఆందోళన చేయడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. సెలవులో ఉన్న సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ వెంటనే ఆస్పత్రికి చేరుకుని సిబ్బందిపై మండిపడ్డారు. ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆయన నిర్ధారించారు. ఇరువర్గాలను పిలిచి సమస్యను పరిష్కరించారు. కాగా..కేజీహెచ్‌లో సిబ్బంది శిశువులను మార్పిడి చేయడంలో ఆరి తేరారని, డబ్బుల కోసం వేధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రసవం అయినా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఆపరేషన్ థియేటర్‌లో శిశువులను మార్చినా ఎవరికీ తెలియదని పలువురు గర్భిణులు, వారి సహాయకులు వాపోతున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కేజీహెచ్ గైనిక్ వార్డు

బలిఘట్టం ఉత్తర వాహినికి గంగాహారతి



హారతి ఇస్తున్న వేదపండితులు

నర్సీపట్నం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బలిఘట్టం ఉత్తరవాహిని నదీ తీరంలో బుధవారం గంగాహారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులతో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఎంతో వైభవంగా గంగాహారతి కార్యక్రమం జరిగింది. భక్తులు గంగా హారతిని వీక్షించారు. గంగా మాత పూజతో ప్రారంభమైన కార్యక్రమం పూజారుల వేదమంత్రాలతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



ఉత్తర వాహిని నదికి నమస్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు కుటుంబ సభ్యులు

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం రైల్వే గేటు సమీపంలో అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తిని (సుమారు వయస్సు 40–45 సంవత్సరాలు) గుర్తు తెలియని రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు విశాఖపట్నం జీఆర్పీ ఎస్ఐ కె.టి.ఆర్. లక్ష్మి గురువారం చెప్పారు. రైల్వే ట్రాక్‌మేన్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు సుమారుగా 5.3 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, పసుపురంగు హ్యాండ్ నెక్ టీ షర్ట్, నేవీ బ్లూ కలర్ ఫుల్ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నట్టు ఆమె చెప్పారు. మరిన్ని వివరాలకు 7382058996 నంబరును సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

నర్సీపట్నం : అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం, కంపరేవుల గ్రామానికి చెందిన పి. చంద్రశేఖర్ అనే గిరిజన యువకుడు నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు అందించిన వివరాలివి. ఉదయం వాకింగ్‌కు వచ్చిన వారు చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం వద్ద బ్యాగ్ లభించింది. అందులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా నర్సీపట్నం అయ్యన్న కాలనీలో నివాసం ఉంటున్న మృతుడి సోదరుడు గోవిందరావుకు సమాచారం అందించారు. మృతుడు పట్టణంలోని బట్టల దుకాణంలో పని చేస్తున్నాడు. వారం క్రితం స్వగ్రామం వెళ్లి మంగళవారం సోదరుడి ఇంటికి వచ్చాడు. ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లిన అతను స్టేడియంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు.



చెట్టుకు వేలాడుతున్న చంద్రశేఖర్ మృతదేహం

శివరాత్రి రోజున విషాదం...

- వేర్వేరు దుర్ఘటనల్లో ఇద్దరి మృతి

ఎస్.రాయవరం : ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ సంఘటలను మేరకు ఎస్ఐ విభీషణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. వరహానదిలో మునిగి ఒకరు, తాటిచెట్టుపై నుంచి జారిపడి మరొకరు మృతి చెందారు. పెనుగొల్లు శివారు వరహానదిలో బుధవారం స్నానం చేసేందుకు ప్రకృతి దుర్గా వెంకటచరణ్(20), మావయ్య కుమారుడు హేమశేఖర్, తమ్ముడు సాత్విక్ లతో కలిసి నదిలోకి దిగారు. నదిలో గతంలో ఇసుక తరలించిన గోతులు ఎక్కువగా ఉండడంతో లోతు గమనించని దుర్గా వెంకట్ చరణ్ నదిలో మునిగిపోయాడు. అది గమనించి సాత్విక్, హిమశేఖర్ కేకలు వేయడంతో స్థానికులు నది నుంచి దుర్గాచరణ్‌ను బయటకు తీసి నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స అందించే లోపే మృతి చెందాడు.

తాటిచెట్టు పైనుంచి జారిపడి..

పెనుగొల్లు గ్రామానికి చెందిన చిందాడ శ్రీను(27) సమీప గ్రామం పి.ధర్మవరంలో తాటిచెట్టుకొమ్మలు కోస్తుండగా జారిపడి మృతి చెందినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. శ్రీను రోజుమాదిరిగా కూలి నిమిత్తం బుధవారం పి.ధర్మవరం గ్రామంలో తాటి చెట్టు కమ్మలు కోసేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కే క్రమంలో ఎండు కమ్మ ఊడిపోవడంతో చెట్టుపై నుంచి జారి నేలపై పడ్డాడు. ఇది గమనించి స్థానికులు శ్రీను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

మార్గమధ్యంలో అంగనంపూడి వచ్చేసరికి చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతులు ఇరువురికి నక్కపల్లి ఆస్పత్రిలో పంచనామా నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒకేరోజు రెండు ఘటనలతో ఇరువురు మృతి చెందడంతో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. వివరాల మేరకు ఎస్ఐ విభీషణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.



చెట్టు పై నుంచి జాడిపడి మృతి చెందిన శ్రీను



నదిలో మునిగి మృతి చెందిన దుర్గా వెంకట్ చరణ్ (ఫైల్)

ఉపాధికి పాలి టెక్నిక్

- పాలిసెట్– 2025 షెడ్యూల్ ఖరారు
- ఏప్రిల్ 30న ప్రవేశ పరీక్ష
- అందుబాటులో 8,592 సీట్లు



విశాఖ నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ



పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

విశాఖ విద్య: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలపై ఈ సారి ముందుగానే సాంకేతిక విద్యాశాఖ దృష్టి సారించింది. ఈ మేరకు పాలిసెట్ 2025కు షెడ్యూల్ ఖరారు చేసింది. ఉమ్మడి విశాఖపట్నం(విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు) జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 28 కాలేజీలు ఉండగా, మొదటి ఏడాదిలో ప్రవేశాల కోసం 12 బ్రాంచిల్లో 8,592 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పాలిటెక్నిక్ పాసైతే ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్‌లలో కొలువు గ్యారెంటీ కావడంతో..ఈ కోర్సుకు విద్యార్థుల్లో మంచి క్రేజ్ ఉంది. అలాగే ఇంజినీరింగ్‌లో నేరుగా చేరవచ్చు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను పాలిటెక్నిక్ కోర్సుల వైపు తీసుకొచ్చేలా సాంకేతిక విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు.

ఇదీ షెడ్యూల్..

10వ తరగతి ఉత్తీర్ణులైన వారు పాలిసెట్‌కు అర్హులు. ఏప్రిల్ 30న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ షెడ్యూల్ జారీ చేసింది. పరీక్ష రాసేందుకు ఓసీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులు రూ.400లు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారైతే రూ.100లు ఫీజు చెల్లించాలి. తగిన ధ్రువీకరణపత్రాలతో https:// polycetap.nic. in/ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ వెబ్‌సైట్ మార్చి మొదటివారంలో అందుబాటులోకి రానుంది. ఇందుకు సిద్ధంగా ఉండాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ మంగళవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హెల్ప్‌లైన్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్

పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులు చేరే విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దరిచేర్చేలా కళాశాలలకు అనుబంధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరిశ్రమలతో కాలేజీలను అనుసంధానం చేయడం ద్వారా ఏటా కాలేజీల్లో క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించారు. నైపుణ్యత గల విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. దీంతో పాలిటెక్నిక్ కోర్సులపై విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. దీంతో సాంకేతిక విద్యకు విశ్వసనీయత పెరిగింది. ఈ ఏడాది కూడా అధిక సంఖ్యలో ప్రవేశాలు ఉంటాయని ప్రిన్సిపాళ్లు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 28 కాలేజీలు

ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నగరంలో రెండు(కంచరపాలెం, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజనీరింగ్), పెందుర్తి, భీమునిపట్నం(బాలికలు), అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, రంపచోడవరం, ఎటపాకలో పాలిటెక్నిక్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. వీటిలో వివిధ బ్రాంచిలకు సంబంధించి 1,779 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే మూడు జిల్లాల పరిధిలో 19 ప్రైవేట్ కాలేజీలు ఉండగా, వీటిలో 6,813 సీట్లు ఉన్నాయి.

హెల్ప్‌లైన్ కేంద్రాల్లో సమాచారం

పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి సాంకేతిక విద్యాశాఖ ఫోకస్ పెట్టింది. దరఖాస్తులు మొదలుకుని, విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు సమస్త సమాచారం అందించేలా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎనిమిది చోట్ల హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ, పెందుర్తి, భీమునిపట్నం, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు, రంపచోడవరం, ఎటపాక ప్రభుత్వ కళాశాలల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు అందుబాటులో వచ్చాయి.

మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్‌కు అడుగులు



- సరకు రవాణాలో సరికొత్త అధ్యాయం
- నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఒప్పందం
- ఎంఎంఎల్‌పీ ఏర్పాటుకు ఫీజబులిటీ స్టడీ కోసం ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు
- ఎంఎంఎల్‌పీని అనుసంధానించే పనులపైనా డీపీఆర్‌కు టెండర్లు
- టెండర్లకు ఏప్రిల్ 8 వరకు గడువు విధించిన ఎన్‌హెచ్ఏఐ
- వల్లూరు–తాడి సమీపంలో 100 ఎకరాలు కేటాయించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- పార్క్ ఏర్పాటు ద్వారా 13 నుంచి 8 శాతానికి తగ్గనున్న రవాణా వ్యయం

సాక్షి, విశాఖపట్నం: లాజిస్టిక్ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విశాఖను ప్రధాన కేంద్రంగా మార్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలకు కీలక అడుగులు పడుతున్నాయి. సరకు రవాణా వ్యయం తగ్గించడంతో పాటు ఎగుమతి, దిగుమతులు సులభతరం చేసే మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ జిల్లాలో ఏర్పాటు కానుంది. 2022 ఫిబ్రవరిలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఈ ఎంఎంఎల్‌పీ ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. అనకాపల్లి సమీపంలో దీన్ని ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు 100 ఎకరాలను కూడా కేటాయించింది. తాజాగా లాజిస్టిక్ పార్క్ ఏర్పాటుకు సంబంధించి ఫీజిబులిటీ స్టడీ కోసం ఎన్‌హెచ్ఏఐ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు పిలిచింది.

లాజిస్టిక్ రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన లాజిస్టిక్ పాలసీ 2021–26కి అనుగుణంగా ఎంఎంఎల్‌పీలని అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. అనకాపల్లి, మునగపాక, పరవాడ మండలాలను కలుపుతూ జాతీయ రహదారికి సమీపంలో భూమిని గుర్తించారు. వల్లూరు, సిరసపల్లి, తాడి గ్రామాల మధ్య 396 ఎకరాల భూమి ఏపీఐఐసీకి ఉంది. ఈ భూముల్లో దాదాపు 100 ఎకరాలను లాజిస్టిక్ పార్క్ కోసం నాలుగేళ్ల క్రితం కేటాయింపులు చేశారు. గతంలో ఇక్కడ విశాఖ పోర్టు ట్రస్టు ద్వారా ఎంఎంఎల్‌పీ నిర్మించాలని భావించారు. అయితే సాగరమాల ప్రాజెక్టు ద్వారా పోర్టు స్థలంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇప్పుడు ఇదే ప్రాంతంలో లాజిస్టిక్ పార్కు రానుంది.

సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి టెండర్లు

ఏపీఐఐసీ సహకారంలో ఎన్‌హెచ్ఏఐ అనుబంధ సంస్థ నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ (ఎన్‌హెచ్ఎల్ఎంఎల్) ఈ ఎంఎంఎల్‌పీ బాధ్యతలు చేపట్టింది. లాజిస్టిక్ పార్క్ అభివృద్ధికి సంబంధించిన ఫీజబిలిటీ స్టడీతో పాటు ఈ పార్కును అనుసంధానిస్తూ రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన డీపీఆర్ తయారు చేసేందుకు కూడా ఆసక్తి వ్యక్తీకరణ(ఆర్ఎఫ్‌పీ) టెండర్లు ఆహ్వానించింది. ఏప్రిల్ 8వ తేదీ వరకూ టెండర్లకు గడువు విధించింది. 9వ తేదీన బిడ్స్ ఓపెన్ చేసిన తర్వాత.. నిబంధనలకు అనుగుణంగా ఫీజబిలిటీ స్టడీస్‌కు సంబంధించిన పనులను అప్పగించనున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు.

రవాణాకు కీలక కేంద్రంగా విశాఖ

ఒక ఉత్పత్తి కేంద్రంలో తయారు చేసిన వస్తువు ధర నిర్ణయించాలంటే అందులో రవాణా చార్జీలను కూడా కలుపుతారు. ప్రతి వస్తువు ధరలో 13 శాతం ఈ వ్యయంగా గణిస్తారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటైతే.. రవాణా వ్యయం తగ్గుతుంది. ఫలితంగా వస్తువు ధర కూడా తగ్గుముఖం పడుతుంది. దీని వల్ల కొనుగోలు దారులు లాభపడటమే కాకుండా అమ్మకాలు కూడా పెరిగే అవకాశాలుంటాయి. ఎంఎంఎల్‌పీ రావడం వల్ల రవాణా వ్యయం 13 శాతం నుంచి 8 శాతానికి తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ పార్క్‌ను జాతీయ రహదారి, రైలు, జల రవాణాతో అనుసంధానం చేస్తారు. ఇది జాతీయ రహదారికి 8 కిమీ, విశాఖ పోర్టుకు 33 కిమీ దూరంలో ఉంది. జలమార్గం ద్వారా సరకు రవాణా చేస్తే చాలా వరకూ ఖర్చు తగ్గుతుంది. విశాఖ జిల్లాలో పోర్టులతో పాటు జాతీయ రహదారి, రైలు మార్గాలు కూడా అందుబాటులో ఉండటంతో ఈ లాజిస్టిక్ పార్కు పారిశ్రామిక తయారీ కేంద్రాలకు కీలకంగా మారనుందని భావిస్తున్నారు. ఎంఎంఎల్‌పీల్లో సరుకు నిల్వకు గోదాములు, శీతలీకరణ గిడ్డంగులు, ట్రక్కులు నిలిపే బే ఏరియా, డ్రైవర్లకు వసతులు, రెస్టారెంట్లు, పెట్రోల్ బంకులు, కస్టమ్ క్లియరెన్సులు, బల్క్ లోడింగ్ వంటి అన్ని సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నారు.

క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో వెంకన్న



కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వరస్వామి అలంకరణ

కశింకోట: కశింకోటలోని విష్ణు ఆలయాలు కూడా మహాశివరాత్రి పురస్కరించుకొని భక్తులతో కళకళలాడాయి. స్థానిక ధ్యాన మందిరంలో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామిని వజ్ర కవచంతో పాటు పూలమాలలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయం, గవరపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు చేశారు.

మద్యం షాపులకు సీళ్లు



కశింకోటలోని ఓ మద్యం దుకాణం తాళం కప్పకు వేసిన సీలు

కశింకోట: కశింకోటలోని మద్యం దుకాణాలకు బుధవారం ఎట్టకేలకు సీళ్లు వేశారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలను రెండు రోజుల ముందు నుంచి మూసివేయాల్సి ఉన్నప్పటికీ పలువురు దొడ్డి దారిన తెరుస్తున్న వైనాన్ని 'మద్యం దుకాణానికి సీళ్లేవి సారూ...'శీర్షికతో 'సాక్షి'పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు స్పందించి షాపు తాళం కప్పలకు సీళ్ల వేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



డిపో గేటు వద్ద తెల్లవారుజామున నిరసన తెలియజేస్తున్న అసోసియేషన్ నాయకులు

అనకాపల్లి: సస్పెండ్ అయిన కండక్టర్ ఎస్.ఎస్.నారాయణను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి కె.ఎస్.వి.రమేష్ డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో గేటు వద్ద గురువారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలను ఉల్లంఘించిన అనకాపల్లి డిపో మేనేజర్‌పై తక్షణమే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో డిపో గేటు వద్ద నిరసన తెలియజేస్తామన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 6,129 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,790	4,670
మొదటి రకం	3,620	4,140
రెండో రకం	3,100	3,740
మూడోరకం	2,900	3,190

అనకాపల్లి సినిమాలు

రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ :రాజా
ఆరెంజ్
:సత్యనారాయణ స్క్రీన్-1(ఉదయం)
పుష్ప-2 :సత్యనారాయణ స్క్రీన్-1(మ్యాట్నీ, 1,2 షోలు)
జాబిలమ్మనీకు అంత కోపమా :సత్యనారాయణ స్క్రీన్-2
మజాకా... :పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం :షిర్డీసాయి
సూర్య కృష్ణన్
:వెంకటేశ్వర(ఉదయం)
తల
:వెంకటేశ్వర (మ్యాట్నీ, 1,2 షోలు)
తండేల్ :శ్రీసత్య
రామం రాఘవం :రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-29 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 311 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 229 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ లో సంప్రదించవచ్చు.



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరునికి పూజలు చేస్తున్న అర్చకులు



సాధువుల గుడిలో పూజలు చేస్తున్న భక్తులు



గవరపేటలో ఉమాశంకర్ ఆలయంలో భజన చేస్తున్న భక్తులు



కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో ధ్వజస్తంభం వద్ద భక్తుల దీపారాధన

మార్మోగిన శివ నామస్మరణ

- పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు
- ఊరూవాడా మహా శివరాత్రి శోభ
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



కశింకోట శివాలయంలో హారతి ఇస్తున్న అర్చకులు

కశింకోట: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం నియోజకవర్గంలో ఊరూవాడా శివనామ స్మరణతో మార్మోగింది. ఓం నమఃశివాయ, హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు శైవ క్షేత్రాల వద్ద బారులు తీరారు. అభిషేక ప్రియుడైన స్వామివారికి ప్రత్యేక పూజలు, మహ న్యాసపూర్వక రుద్రాభిషేకాలతో అర్చించారు. రోజంతా ఉపవాసం, జాగరణలతో తమ భక్తిని చాటుకున్నారు. కశింకోట మండలంలోని శివాలయాలు హరహర నామస్మరణంతో మార్మోగాయి. కశింకోటలో పురాతనమైన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో వేకువ జాము నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఏకాదశ పూర్వక మహారుద్రాభిషేకం చేశారు. అర్ధరాత్రి లింగోద్భవ పూజలు చేసి, పూలతో అలంకరించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన, రాత్రి లింగ దీపార్చన నిర్వహించారు. కస్పావీధిలోని సాంబశివుని ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. స్థానిక గవరపేటలోని శారదానది తీరాన ఉన్న ఉమామహేశ్వరుల ఆలయంలో జలాభిషేకం, పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.



ఏఎస్‌పేటలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

అమీన్‌సాహెబ్‌పేటలో గిరి ప్రదక్షిణ

అమీన్‌సాహెబ్‌పేటలోని సాంబశివుని లోవ ప్రాంతంలో తొలిసారిగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయం నుంచి శివ పార్వతుల చిత్ర పటంతో డప్పులు వాయిద్యాలతో ప్రారంభమైన ప్రదక్షిణ ఏఎస్ పేట, నరసాపురం, గొబ్బూరుపాలెం, సోమవరం గ్రామాల మీదుగా సాగింది. భక్తులు ఉత్సాహంగా హాజరయ్యారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, యువ నాయకుడు మలసాల కుమార్‌రాజా, తదితరులు పాల్గొన్నారు. భజనలు, తోడపెద్దు సేవ ఆకట్టుకున్నాయి.



ఏఎస్ పేటలో సాంబశివుడిని దర్శించుకుంటున్న భరత్‌కుమార్, భక్తులు

- వెదురుపర్తిలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బయ్యవరం, పేరంటాలపాలెం, సోమవరం, చింతలపాలెం, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెం శివాలయాలు, ఉగ్గినపాలెంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయం, బంగారయ్యపేటలోని బసవేశ్వరస్వామి ఆలయం, సాంబమూర్తి ఆలయం, తాళ్లపాలెంలోని రామలింగేశ్వర ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కశింకోటలోని కోనేరు వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని భక్తులు ఎక్కువగా దర్శించారు. గవరపేటలోని విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి చిత్ర పటాన్ని నెలకొల్పి పూజలు చేశారు. గ్రామ వీధుల్లో బాణసంచా కాలుస్తూ ఊరేగించారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలోని శివాలయాలన్నీ శివ నామస్మరణతో మార్మోగాయి. కాశీవిశ్వేశ్వరస్వామి, సిద్ధి లింగేశ్వరస్వామి, భోగలింగేశ్వరుని, ఉమరామలింగేశ్వరుని, చౌడేశ్వరీ సాంబమూర్తి ఆలయాలు, వేల్పులవీధి, గవరపాలెం, కుంచావారి వీధి గౌరీపరమేశ్వరుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పాల సముద్రంలో 12 అడుగుల శివుని విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది. భోగలింగేశ్వర స్వామి కోవెలలో ఉదయం 6 నుంచి సాయత్రం 6 గంటల వరకు ఓం నమశ్శివాయ అర్ధ ఏకాహం నామ సంకీర్తన కార్యక్రమం ఘనంగా జరిగింది.

తుమ్మపాల: మండలంలో శివనామ స్మరణతో పల్లెలు మార్మోగాయి. గొలగాంలో మల్లికార్జున స్వామి, అక్కిరెడ్డిపాలెం పంచాయతీ శీరంశెట్టివానాపాలెంలో ఉమా సమేత పంచముఖ నందీశ్వర స్వామి, కనకదుర్గమ్మ కాలనీలో శివలింగం, మార్టూరు, తుమ్మపాల, రేబాక, కోడూరు, మామిడిపాలెం, బవులువాడ, వెంకుపాలెం, సీతానగరం, కూండ్రం, కుంచంగి, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పలు సాంస్కృతి కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.



వేల్పులవీధి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 12 అడుగుల శివుని విగ్రహం



కశింకోట శివాలయంలో అన్నసమారాధన

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

అనకాపల్లి టౌన్: పట్టణంలో అన్ని వార్డుల్లోనూ వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరోసారి పార్టీ పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం ఉడ్‌పేట జానకీరామరాజు కార్యాలయం నుంచి రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి పార్టీ శ్రేణులతో చేరుకున్నారు. అనంతరం ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌ను మందపాటి జానకీరామరాజు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కడిమిశెట్టి సతీష్ సత్కరించారు. ఈ సందర్భంగా జానకీ రామరాజు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అందర్నీ సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, నాయకులు ఉగ్గిన శ్రీనివాసరావు, కోరుకొండ రాఘవ, వేల్పుల గణేష్, కొంకి శ్రీరామమూర్తి, భార్గవ్, వాసు తదితరులు పాల్గొన్నారు.



మలసాల భరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న మందపాటి జానకీరామరాజు, కడిమిశెట్టి సతీష్

ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు



పోలింగ్ బూత్‌లకు సిబ్బందిని తరలించేందుకు ఎన్టీఆర్ మైదానంలో సిద్ధంగా ఉన్న బస్సులు

- నియోజకవర్గంలో ఓటర్లు 665 మంది
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల సిబ్బంది బుధవారం పోలింగ్ సామగ్రితో తమకు కేటాయించిన కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో చేరుకున్నారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ బూత్‌లో ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. అనకాపల్లి పట్టణ, మండలంలో 582 మంది ఓటర్లు, కశింకోట మండలంలో 83 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అనకాపల్లి పట్టణ, మండలంలో ఉపాధ్యాయులు ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలోను, కశింకోట మండలంలో కశింకోట గ్రామం బజారువీధి ఎంపీపీ హైస్కూల్‌లోను ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఉడ్‌పేట స్కూల్లో ఐదుగురు పోలింగ్ సిబ్బంది, కశింకోట ఎంపీపీ స్కూల్లో నలుగురు సిబ్బందిని నియమించామన్నారు. రెండు పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.



బ్యాలెట్ బాక్స్‌లు తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది

కశింకోట: స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు బ్యాలెట్ బాక్స్‌లతో సిబ్బంది చేరుకున్నారు. మొత్తం 83 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో ఉన్న ఓటర్ల అంతా ఇక్కడే ఓట్లు వేయాల్సి ఉంది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. నలుగురు పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్రం ఎదుట షామియానా ఏర్పాటు చేశారు.



కశింకోట పాఠశాలలో పోలింగ్ కేంద్ర సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



కశింకోటలో పోలింగ్ కేంద్రానికి చేరిన సిబ్బంది

ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు

కశింకోట: కశింకోటలోని ఆటో స్టాండ్ వద్ద ఉన్న టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు విగ్రహానికి బుధవారం ముసుగు వేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అనుసరించి వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్ నేతలకు సంబంధించిన విగ్రహాలకు ముసుగులు వేసి ఎన్టీఆర్ విగ్రహానికి మాత్రం ముసుగేయకపోవడంపై 'కోడ్ అమలులో పచ్చపాతం'శీర్షికన బుధవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు స్థానిక అధికారులు స్పందించారు. ఎన్టీఆర్ విగ్రహం ముఖానికి ముసుగు వేశారు.



ఆటో స్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తొడిగిన ముసుగు

లోక కల్యాణార్థం విశ్వశాంతి మహా యజ్ఞం

నర్సీపట్నం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సిటీ క్లబ్ వారు ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో విశ్వశాంతి మహా యజ్ఞం ఘనంగా నిర్వహించారు. యజ్ఞ గురువు మాఘన కృష్ణమూర్తి శాస్త్రి దంపతులచే హోమం జరిపించారు. సర్వదోష నివారణకు యజ్ఞం దోహదపడుతుందని కృష్ణమూర్తి శాస్త్రి పేర్కొన్నారు. ఈ యజ్ఞ క్రతువులో 108 మంది దంపతులు పాల్గొన్నారు.



యజ్ఞంలో పాల్గొన్న దంపతులు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్ బీపీ అగ్రహారంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైంది. సానబోయిన అప్పారావు ఈ పూరింట్లో నివశిస్తున్నారు. తన భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లగా మంటలు చెలరేగాయి. ఇంటిపై భాగంలో ప్లాస్టిక్ కవరు కప్పి ఉండటంతో మంటలు లోపలికి వ్యాపించాయి. మంటలను అదుపు చేయడానికి స్థానికులు ప్రయత్నించారు. చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారొచ్చి మంటలు అదుపు చేశారు. సుమారు రూ. 2 లక్షల 50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అప్పారావు తెలిపారు. ఫ్యాన్, బీరువా, బట్టలు, వంట సామగ్రి ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి.



ప్రమాదంలో దగ్ధమైన పూరిల్లు

భరత్‌కుమార్‌కు సన్మానం

అనకాపల్లి: స్థానిక రింగ్ రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌ను పట్టణంలో విజయరామరాజుపేట, శ్రీరామ్‌నగర్ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా శ్రీరామనగర్ యూత్ సభ్యులు బుధవారం సత్కరించి, బుద్ధుని విగ్రహాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాన్ని ప్రశాంతమైన వాతావరణలో నిర్వహించామని, అమ్మవారి ఉత్సవానికి భరత్‌కుమార్ తన వంతు సహాయం అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, శ్రీరామ్‌నగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



మలసాల భరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న శ్రీరామ్ నగర్ యూత్ సభ్యులు

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: మహాశివరాత్రి మహోత్సవంలో భాగంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 31వ ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఉన్న ఆలయం నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాన్ని ప్రత్యేక రథంలో ఉంచి పట్టణ పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోరుకొండ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి తుంపాల సతీష్, పట్టణ కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవ అధ్యక్షుడు కోసూరి మన్మథరావు, కామాక్షి కార్పెంటర్ సభ్యులు, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జూదం ఆడుతున్న నలుగురు అరెస్ట్

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట గ్రామ శివారులో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆరు గుళ్లు, నెంబర్ పట్టా, రూ.2630 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు గుళ్లాట ఆడుతున్న స్థావరంపై ఆకస్మిక దాడి చేశామన్నారు. ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.



ఏఎస్‌పేటలో పోలీసుల అదుపులో నిందితులు

శివుని విగ్రహం ఆవిష్కరణ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట శ్మశానవాటికలో నిర్మించిన శివుని విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ విగ్రహాన్ని అదే గ్రామానికి చెందిన మదిని గోవింద జ్ఞాపకార్థం సోదరుడు శ్రీను అందించిన సహకారంతో నిర్మించారు. మహా శివరాత్రి సందర్భంగా విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు గుమ్మడి నారాయణరావు, పక్కుర్తి సంతోష్, పుర్రె నరసింగరావు, గంటిన శ్రీను, జెర్రిపోతుల సన్యాసినాయుడు, ఇల్లపు నూకరాజు, పాల్గొన్నారు.



బంగారయ్యపేట శ్మశానంలో ఆవిష్కరించిన శివుని విగ్రహం

'గవర్నర్ ప్రసంగంలో అన్నీ అవాస్తవాలే'

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన కరపత్రాన్ని గవర్నర్ చదివినట్లుగా ఉందని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బోట్టా చిన్నయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా గవర్నర్ చదివిన ప్రసంగంలో వాస్తవాలను దాచి అవాస్తవాలను వినిపించారన్నారు. అధికారం చేపట్టి 9 నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలపై స్పష్టత లేదన్నారు. మిర్చి, టమాట రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉంటే.. రైతులు సుభిక్షంగా ఉన్నారని గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించడం తగదన్నారు.

నేడు స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన

అనకాపల్లి: స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరి తోటలోని వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం స్వామికి స్వర్ణ సంపెంగ పుష్పాలతో అర్చన చేయనున్నట్టు ఆలయ ప్రతినిధి మళ్ల రామచంద్రరావు బుధవారం తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు.



గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో వరాహ లక్ష్మీనృసింహస్వామి